# అసూయ?

'అరుంధతి'

—X—

ఆ రోజంతా మా ఆవిడ కాస్త చీకాకుగానే వుంది. నా యెదుట పడినప్పుడల్లా నా ముఖంలోకి అనుమానంగానే చూచేది. ఆ రాత్రి విస్తరిముందు కూర్చున్న పది నిమిషాలు దాని దృష్టి అంతా నా మీదే వుంది. ఎప్పుడూ నాతో కూడ భోజనానికి కూర్చునేది ఆ వేళ నా ఒక్కడికి పెట్టింది. నా భోజనమైన తర్వాత అది భోజనంచేసి, అంతా సర్దుకుని వంటింట్లో దీపాలు ఆర్పేటప్పటికి పదిన్నర అయింది. నేనూ పేపరు చదువుకుంటూ కూర్చున్నా నన్న మాటేకాని ఆలోచనంతా దీన్నిగురించే! ఆ నాటి మా ఆవిడ వింతప్రవర్తన నాకేమీ అర్థం కాలేదు. నా ఆలోచనలకు అంతంలేదు. సమస్య మాత్రం తీరలేదు. నాకు పక్కవేసి తాను గృహలక్ష్మి పుచ్చుకుని కూర్చుంది. సాయంకాలం ఆఫీసు నుండి వచ్చేటప్పుడు పట్టుకొచ్చిన మల్లెపూలు అలాగే వున్నాయి టేబిలుమీద. రేడియో కూడ పెట్టలేదు. నాకు పిచ్చెత్తినట్లైంది. పేపరు మూసేసి దానివైపే చూస్తూకూర్చున్నాను పది నిముషాలు. అబ్బే! అది మాత్రం కదలలేదు. తెల్లవారితే ప్రయాణం. ఏమిటిది? ఇంకా యేమీ సర్దుకోలేదు. అయినా నాకుమాత్రం ఒళ్లు మండి యింది. కాని చేసేదేమిటి? ఆడవాళ్లు ఆ పరిస్థితుల్లో వున్నప్పుడు మొగాడు యేమాత్రం కోపగించుకున్నా ఆశించిన ఫలితం దక్కకపోగా - మనకే యెదురు తిరిగి రసాభాస అవుతుందని ఒక సారి మా ఆవిడే అంది. అయితే యెంత సేపని యీ ఎడముఖం - పెడముఖం! "నిర్మలా!" అంటూ నెమ్మదిగా పిలిచాను. అది వినిపించుకోలేదు - మళ్ళీ పిలిచాను. "ఏం?" అంటూ చేతిలోని పుస్తకం ప్రక్కన పెట్టి అనుమానంగా చూచింది. "మాట యిల్లారా!" అన్నాను నవ్వుతూ. 'చెప్పండి యేమిటో' విసుగ్గా అంది. "యిలారా చెప్తాను" నవ్వుతూనే అన్నాను. వచ్చి ప్రక్కన నిలబడి 'ఏం?' అంది

"ఇలా కూర్చో," అన్నాను దాని ముఖంలోకి చూస్తూ. ప్రక్కనే కూర్చుని తలవంచుకుంది. "ఏం అలాగున్నావు యీవాళ?" నెమ్మదిగా అడిగాను.

"ఏమీలేదు" ముక్తసరిగా సమాధానమిచ్చింది

"మల్లెపూలు పెట్టుకోలేదేం?"

"ఏమీలేదు"

"అంటే?"

"అంటే -యేమీలేదు"

"ఎందుకు అంతకోపం?"

"ఎవరికి కోపం?"

"నీకు..."

"నాకేం కోపంలేదు."

"అయితే యెందుకలా వున్నావు?"

"ఏమీలేదు... కాని నేనొక విషయం అడుగుతాను నిజం చెప్తారా?" అంటూ నా కళ్లలోకి పరీక్షగా చూచింది. "నాకు తెల్సుంటే..." అని నవ్వాను. నా నవ్వుకు దానికి ఒళ్లు మండుకుపోయింది.

"అయితే మీ పర్సులోని ఫొటో యెవరిది?"

అటంబాంబు పడ్డంత పనైంది. ఏం సమాధానమివ్వాలో అర్థంకాలేదు. నిజం చెప్పినా కాని యిటువంటి విషయాల్లో ఆడవాళ్లు నమ్మరు. వాళ్లను నమ్మించడం బ్రహ్మతరం కాదు. ఒకవేళ నమ్మినట్లు నటించినా - జీవిత పర్యంతం అనుమానం పీడిస్తూనే వుంటుంది. నిజంగా ఆ ఫొటో యెప్పుడో యెక్కడో దొరికింది. దాన్ని చూడ్డంతోనే ఆ కళ్లలో యేదో ఆకర్షణ కన్పించింది, అవతల పారెయ్యలేక మనీ పర్సులో పెట్టాను. అంతే ఆ ఫొటో చరిత్ర. అయితే ఆ ఫొటో పర్సులో వుందన్న సంగతే మరచిపోయాను. లేకపోతే యెప్పుడో తీసివేశేవాణ్ణి. నా పెళ్ళిముందు దొరికిన ఫొటో అది. అయినా యిప్పుడైనా తీసేద్దామంటే మనసొప్పదు! నాకు నవ్వొచ్చింది. "ఆదెవరో ఫొటో ఎక్కడో దొరికింది. ముఖం కళగావుంది. పారెయ్యడమెందుకని అందులో పడేశాను." అన్నాను నెమ్మదిగా.

"దాని ముఖం అంత కళగా వుంటే నాలాంటి కురూపిని యెందుకు చేసుకున్నారు?" అంటూ తీక్షణంగా చూచింది. "అదేమిటే?" అన్నాను వెర్రిగా.

"అదే నేనూ అడుగుతున్నాను - పర్సులో పెట్టుకుని తిరిగేటంత కళగావుంటే నన్నెందుకు చేసుకున్నారని."

"అదికాదే- నిజంగా ఆ ఫోటో దొరికింది..."

"చాల్లెండి! ఇటువంటి ఫోటోలు దొరికాయంటే యెవ్వరూ నమ్మరు. ఇంకా దాస్తారెందుకు? అబద్ధమాడినా నమ్మేలాగవుండాలి."

"అబద్ధం కాదే - నిజం"

"మీరు లక్ష చెప్పండి నేను నమ్మలేను." నాకు ఒకవైపు కోపం, ఒకవైపు నవ్వుకూడ వస్తోంది. ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు. అలాగే వెర్రిగా చూస్తూ కూర్చున్నాను. నేను గట్టిగా సమాధానం చెప్పకపోవడం దాని అనుమానాన్ని మరింత బలపరచింది. మౌనం అర్ధాంగీకారమన్నట్లు వెంటనే అందుకుంది—

"నేను యీ వూరు వచ్చినప్పటినుండి చూస్తున్నాను-మీ వ్యవహారమూ మీ ప్రవర్తనను—నన్ను మీతో సినిమాకు తీసుకువెళ్లటం సిగ్గు. బజారుకు తీసుకువెళ్ళాలంటే అనుమానం, కలిసి పార్కుకు వెడదామంటే స్నేహితులు చూచి నవ్వుతారని భయం. నిజం చెప్పండి — ఒక్కసారైనా నన్ను మీతో యెక్కడికైనా తీసుకు వెళ్లారా? నేను వచ్చిన తర్వాత యీ ఆరు నెలల్లోను వెళ్ళిన నాలుగు సినిమాలకు రెండో ఆటకు తీసుకువెళ్ళారు యెవ్వరూ చూడరు కదా అని. ఆదివారంనాడు పార్కుకు పక్కింటి ఆవిడతో వెళ్ళమనేవారు. నేను అంత అంద వికారంగా వున్నప్పుడు ఆవిణ్ణే చేసుకోలేక పోయారా! ... ఇప్పుడైతేయేం? మించిపోయిందేమీ లేదులెండి. నేనూ మా పుట్టింటికి పోతాను. ఆవిణ్ణే తెచ్చుకుని యింట్లో పెట్టుకోండి. నాబాధ మీకెందుకు? ఇద్దరూ జట్టాపట్టా వేసుకుని ఊరేగవచ్చు"

"నిర్మలా! ఒకసారి చెప్తే వినాలి, గ్రహించాలి. మాటమీద నమ్మకముండాలి. ఏమిటిదంతా పిచ్చిదానిలాగ..."

"అవును. పిచ్చిదాన్ని చేసే యిన్నాళ్లు యిలా మీ యిష్టమొచ్చినట్లు చేస్తున్నారు."

"అయితే నా మాటమీద నమ్మకంలేదా?"

"ఉందబట్టే యింతవరకు వచ్చింది." అంటూ తెచ్చిపెట్టుకున్న నవ్వుతో నా ముఖంలోకి చూచింది. ఆ నవ్వు వెనకాలే అసూయ, అపహాస్యం, యేదో బాధ స్పష్టంగా కన్పిస్తున్నాయి. నే నేమీ మాట్లాడలేదు. "ఏమండి! ఆ అమ్మాయి పేరేమిటి?" అంది నవ్వుతూ. "నాకు తెలీదే - అసలు ఆ పిల్ల యెవరో కూడ నాకు తెలీదు."

"మీకు తెలియదంటే నే నొప్పుకోను కాని-పోనీ మీరిద్దరూ కలిసి యెన్ని సినీమాలకు వెళ్లారు చెప్పండి!"

"నిజమే నే నెప్పుడూ చూడలేదు ఆ పిల్లను."

"సరేలెండి మీతో వాదన యెందుకు..." అంటూ పెట్టె సర్దటం మొదలుపెట్టింది.

ఆ మరునాడే రాజమండ్రి చేరాం. భోజనం చేసి కాస్సేపు పడుకుందామని నడ్డి వాల్చాను. చెల్లెళ్ళిద్దరూ డబ్బుకోసమని పర్సుతీశారు. "ఒదినా యీ ఫోటో యెవరిదమ్మా!" అన్నారు. నాగుండెలు ఆగిపోయాయి. హైదరాబాదునుండి బయల్దేరేటప్పుడే ఆ ఫోటో తీసేద్దామనుకున్నాను. మా ఆవిడకు కూడ చాల చీకాకు వేసింది. రెట్టించి అడిగేసరికి, "నాకు తెలీదు. మీ అన్నయ్యనడగండి" అంది విసుగ్గా.

తెల్లవారుఝామున పెళ్ళి రాత్రి భోజనాలయ్యాక మా పెద్ద ఒదిన అడిగింది. "ఏం నిర్మలా! మీ ఆయన పర్సులోవున్న ఫోటో యెవరిది? నే నెవరితోను చెప్పనులే."

"ఏమో నాకు తెలియదండి...అది చాల రోజుల నుండి వుందిట నాకు తెలీదు. నేనూ మొన్న రాత్రి

యిక్కడకు వచ్చేయుందు చూశాను. అప్పుడే అది గాను...యెక్కడో దొరికిందట..."

"దొరికిన ఫొటో పర్సులో యెలా పెట్టుకున్నాడు! అసలు దొరికిందంటే నువ్వెలా నమ్మేవు? ఏమొచ్చిందమ్మా నిక్షేపంలా వుండేవాడు యిక్కడ వున్నప్పుడు..."

నెమ్మదిగా యీ వార్త అందరి చెవుల్లోను పడింది అయినా నన్ను మాత్రం యెవ్వరూ అడగలేదు. ఇక అక్కడ వుండడం చికాకేసింది. ఆ మరునాటి సాయంకాలమే బయల్దేరి హైదరాబాదు వచ్చేసి పర్సుమాత్రం పెట్లో పడేశాను. అయితే మా ఆవిడకు మాత్రం కోపం తగ్గలేదు. సత్యాగ్రహం మొదలు పెట్టింది. దాని యిష్టమొచ్చినట్లు చెయ్యడం మొదలు పెట్టింది. సాయంకాలం యింటికి వచ్చేసరికి కాసిని టీ నీళ్లు ప్లాస్కులో పోసి నిద్రపోయేది. ఒకరోజా రెండు రోజులు. ఆఖరికి విసుగొచ్చింది. "ఏమే! ఏమిటి యిదంతా?" అబ్బే! సమాధానం లేకపోగా మంచం మీదనుండికూడ లేవలేదు. "నిర్మలా! నీ వ్యవహారమేమీ బాగులేదు. ప్రాణాలు పోతూ వస్తుంది యీ జంతువ. కాసిని కాఫీ నీళ్లైనా యిద్దామని లేదేమే!"

"ఫ్లాస్కులో వుంది."

"అంతేనేకాని నువ్వు మాత్రం లేవనంటావు... సరే యేమైనా చేశావా?"

"మీరొచ్చేసరికి అన్నీ సిద్ధంచేసి, రాగానే నోట్లోపెట్టి తినిపించడానికి నాకు ఓపికలేదు. అదవరో మీ నెత్తిమీది దేవతని తెచ్చి యింట్లో పెట్టుకోండి. మీకు కావలసినదల్లా చేసి పెట్టుతుంది." అంటూ లేచి ఫ్లాస్కు గ్లాసు నా ముందర పడేసి చర్రున వంట యింట్లోకి వెళ్లిపోయింది.

నిజంగా నాకు మతిపోయింది, నెమ్మదిగా కాఫీ త్రాగి పెట్లోంచి పర్సు తీశాను. అందులో ఫొటో లేదు. నిర్మల తీసేసిందేమో అనుకుని ఈజీచైరులో కూలబడి ఆలోచిస్తున్నాను. ఎదురుగా క్రొత్త ఫొటో నా కళ్లబడింది, లేచి చూచాను. ఇంకేముంది, పర్సులోని ఫొటో తీసి ఫ్రేము కట్టించింది. పైగా దానికి పూలదండ కూడా వేసింది. నాకు మహా చీకాకు వేసింది.

"నిర్మలా! నిర్మలా!" గట్టిగా పిలిచాను. మాట్లాడకుండావచ్చి గది గుమ్మంలో నిలబడింది, దాన్ని చూడగానే మనసు రగుల్కొపోయింది.

"ఏమిటిదంతా? ఏమిటీ ఫొటో!"

"ఏం?"

"ఏమిటిదంతా?" కోపంగా అన్నాను.

"పర్సులో పెట్టుకుని ఊరంతా తిరగ్గాలేంది ఫ్రేము కట్టించి పడక గదిలో పెట్టుకుంటే తప్పొచ్చిందా! ఇలావుంటే యెప్పుడూ కళ్లెదురుగా వుంటుంది. చూస్తూ తీయని కలలు కంటూ పడుకో వచ్చు. రేపే నేను మావాళ్లింటికి వెడుతున్నాను. తర్వాత మీ యిష్టమొచ్చినప్పుడు ఆవిణ్ణి తీసుకొచ్చుకోండి. లేదా మీరే ఆమె వద్దకు వెళ్లి వుండండి. నేను మాత్రం యిక్కడ వుండలేను. వుండను. మీరు బాధపడ్డం, నేను బాధపడ్డం- యెందుకొచ్చింది! మీరు ఆనందంగా వుంటేచాలు అదే నేను కోరేది." అంటూ కన్నీరు కారుస్తూ నా ముఖంలోకి చూసింది.

"నిర్మలా? చెప్పితే వినాలి. లేదా తనకుతోచాలి. రెండూ లేనప్పుడు చాలకష్టం. అయినా యింతవరకు వస్తుందని తోస్తే యెప్పుడో చింపేశేవాణ్ణి" అంటూ గోడనున్న ఫొటో తియ్యబోయాను. చేయిజారి క్రిందపడి ముక్కలైంది. లోపలి ఫొటో తీసి నాలుగు ముక్కలు చేశాను.

ఆ రోజు మొదలుకుని యీ పది సంవత్సరాల లోను మళ్లీ ఆ ఫొటో సంగతి మాట్లాడలేదు. తర్వాత యెప్పుడో ఒకసారి నాకు జ్వరం వస్తే నవ్వుతూ అంది-"ఏమండి! ప్రియురాలి కోసం బెంగపెట్టుకున్నారా? పోనీ చూసిరండి ఒక్కసారి."